# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 27-12-2025 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము రేపు ఉత్తర కర్ణాటక కార్వార్‌లోని 'ఐఎన్ఎస్ కదంబ' నౌకాదళ స్థావరాన్ని సందర్శించనున్నారు.
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ఢిల్లీలో ఐదవ "ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల జాతీయ సదస్సు" జరుగుతోంది.
- "వీబీ-జీ-రామ్-జీ" పథకం ద్వారా ఇకపై నిర్ణయాలన్నీ గ్రామ స్థాయిలోనే జరుగుతాయని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ స్పష్టం చేశారు.
- రానున్న మూడు రోజుల పాటు పంజాబ్, హర్యానా, చండీగఢ్, ఢిల్లీ, బీహార్ రాష్ట్రాల్లో భారీగా పొగమంచు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) హెచ్చరించింది.

========================

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము రేపు ఉత్తర కర్ణాటక కార్వార్‌లోని 'ఐఎన్ఎస్ కదంబ' నౌకాదళ స్థావరాన్ని సందర్శించనున్నారు. నౌకాదళ స్థావరాన్ని పరిశీలించిన అనంతరం, రాష్ట్రపతి కార్వార్ నౌకాశ్రయం నుంచి జలాంతర్గామిలో ప్రయాణించనున్నారు. దేశ చరిత్రలో జలాంతర్గామిలో ప్రయాణించనున్న రెండవ రాష్ట్రపతిగా ఆమె రికార్డు సృష్టించనున్నారు.

========================

ఢిల్లీలో జరుగుతున్న ఐదవ 'ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల (చీఫ్ సెక్రటరీల) జాతీయ సదస్సు'కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వం వహిస్తున్నారు. నిన్న ప్రారంభమైన మూడు రోజుల సదస్సులో ప్రధానమంత్రి ఈ రోజు పాల్గొన్నారు. రేపు కూడా నరేంద్ర మోదీ ఈ సమావేశానికి అధ్యక్షత వహించనున్నారు. జాతీయ అభివృద్ధి లక్ష్యాల సాధనలో కేంద్రం, రాష్ట్రాల మధ్య భాగస్వామ్యాన్ని పటిష్ఠం చేయడమే ఈ సదస్సు ప్రధాన ఉద్దేశ్యం. ప్రధానమంత్రి ఆకాంక్షించిన 'సహకార సమాఖ్య' స్ఫూర్తితో ఈ సదస్సు కొనసాగుతోంది. 'వికసిత భారత్ కోసం మానవ వనరులు' అనే ఇతివృత్తంతో జరుగుతున్న ఈ చర్చల్లో.. దేశంలోని మానవ వనరుల సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవడం, సమగ్ర అభివృద్ధిని వేగవంతం చేయడంపై దిశ నిర్దేశం చేస్తున్నారు. ఈ కీలక భేటీలో అన్ని

రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, సీనియర్ అధికారులు, వివిధ రంగాల నిపుణులు పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సిక్కుల పదవ గురువు.. గురు గోవింద్ సింగ్ జయంతి (ప్రకాశ్ ఉత్సవం) పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు ఆ మహనీయుని త్యాగాలను, బోధనలను స్మరించుకున్నారు. సోషల్ మీడియా వేదికగా రాష్ట్రపతి స్పందిస్తూ.. "శ్రీ గురు గోవింద్ సింగ్ అజేయమైన సాహసం, అరుదైన విజ్ఞతతో ప్రజలను ధర్మబద్ధమైన జీవితం గడపడానికి ప్రేరేపించారన్నారు. గురు గోవింద్ సింగ్ సాహసం, కరుణ, త్యాగానికి నిలువుటద్దమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 129వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” తెలుగు అనువాదం ప్రధానమంత్రి ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, తిరిగి రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల ద్వారా ప్రసారం కానుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (SIR) ప్రక్రియ కీలక దశకు చేరుకుంది. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులపై అభ్యంతరాలు, దరఖాస్తుల పరిశీలనకు సంబంధించి ఈరోజు నుంచి రాష్ట్ర వ్యాప్తంగా విచారణలు (Hearings) ప్రారంభమయ్యాయి. ఇందుకోసం ఎన్నికల సంఘం 3 వేల 234 విచారణ కేంద్రాలను ఏర్పాటు చేసింది. తొలి విడతలో భాగంగా సుమారు 32 లక్షల మంది ఓటర్లను విచారణకు పిలవనున్నారు. ఈ ప్రక్రియకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (CEO) మనోజ్ కుమార్ అగర్వాల్ తెలిపారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా ఇండిగో విమాన సర్వీసుల వరుస అంతరాయాలపై పౌర విమానయాన నియంత్రణ సంస్థ (డీజీసీఏ) నియమించిన విచారణ కమిటీ నివేదికను సమర్పించింది. డీజీసీఏ జాయింట్ డైరెక్టర్ జనరల్ సంజయ్ కె. బ్రాహ్మణే నేతృత్వంలోని నలుగురు సభ్యుల కమిటీ.. నిన్న సాయంత్రం సమగ్ర నివేదికను సమర్పించింది. గత కొద్ది రోజులుగా ఇండిగో విమాన సర్వీసులు భారీగా రద్దు కావడం, వేళల్లో మార్పులు చోటు చేసుకోవడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న విషయం తెలిసిందే. ఈ పరిస్థితులకు దారితీసిన కారణాలను విశ్లేషించడానికి ఈనెల 5న ఈ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ నివేదిక ఆధారంగా డీజీసీఏ తదుపరి చర్యలు తీసుకోనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేవలం ఎన్నికల లబ్ధి కోసమే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి మహాత్మా గాంధీ పేరును కాంగ్రెస్ పార్టీ వాడుకుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ విమర్శించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమాల్లో ఈరోజు ఒక పోస్ట్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఉపాధి హామీ బడ్జెట్‌లో పదే పదే కోతలు పెట్టిందని ఆయన ఆరోపించారు. ఆ పథకం స్థానంలో కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన “వికసిత్ భారత్ - గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవిక మిషన్ గ్రామీణ్” (విబి-జి-రామ్-జి) పథకం ద్వారా ఇకపై నిర్ణయాలన్నీ

గ్రామస్థాయిలోనే జరుగుతాయని మంత్రి స్పష్టం చేశారు. దూరదర్శన్ కి ఇచ్చిన ఇంటర్వ్యూ లో మాట్లాడుతూ... ఉపాధి హామీని మరింత పటిష్టం చేశామని, గతంలో ఉన్న 100 పని దినాలను 125 రోజులకు పెంచినట్లు శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత అభివృద్ధి ప్రస్థానంలో 2025 సంవత్సరం ఒక సువర్ణ అధ్యాయంగా నిలిచిపోనుంది. దేశీయ పన్నుల రంగంలో చోటు చేసుకున్న విప్లవాత్మక మార్పులపై 'సంస్కరణల సంవత్సరం' పేరిట ఆకాశవాణి అందిస్తున్న ఒక ప్రత్యేక వార్తా కథనం...

భారత పన్నుల చరిత్రను పరిశీలిస్తే.. 1930లో మహాత్మా గాంధీ చేపట్టిన ఉప్పు పన్ను నుంచి 1970వ దశకంలో ఏకంగా 97.5 శాతానికి చేరిన ఆదాయపు పన్ను రేట్ల వరకు.. అధిక పన్నులు ప్రజల్లో అపనమ్మకాన్ని, భయాన్నీ పెంచాయి. అయితే, గత ఎనిమిదేళ్లుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు... ముఖ్యంగా 2025లో తీసుకున్న నిర్ణయాలు ఆ చేదు జ్ఞాపకాలను చెరిపివేసి పారదర్శకతకు బాటలు వేశాయి. 2017లో 'ఒకే దేశం - ఒకే పన్ను' నినాదంతో వచ్చిన జీఎస్టీ 2025లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది. పన్నుల వ్యవస్థను సరళతరం చేస్తూ.. కేవలం 5 శాతం, 18 శాతం అనే రెండు ప్రధాన స్లాబ్‌లను మాత్రమే ఖరారు చేసింది. పన్నుల సంస్కరణలతో ఈ ఏడాది దీపావళి సందర్భంగా 6 లక్షల కోట్ల రూపాయలకు పైగా అమ్మకాలు జరిగాయి. 2014లో కేవలం 2 లక్షలు రూపాయలుగా ఉన్న ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని ఈ ఏడాది ఏకంగా 12 లక్షల రూపాయలకు పెంచడం మధ్యతరగతి ప్రజలకు దక్కిన అతిపెద్ద వరం. ఇన్సూరెన్స్ ప్రీమియంలపై జీఎస్టీని పూర్తిగా తొలగించడంతో పాటు, నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యుడికి అందుబాటులోకి వచ్చాయి. కేవలం గణాంకాల మార్పు మాత్రమే కాదు.. ప్రభుత్వానికి, పౌరులకు మధ్య నమ్మకం, పారదర్శకతలను పెంపొందించడమే 2025 పన్ను సంస్కరణల ఉద్దేశ్యం. ఇదే ఇప్పుడు దేశ ఆర్థిక పురోగతికి ఇంధనంగా మారుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రానున్న మూడు రోజుల పాటు పంజాబ్, హర్యానా, చండీగఢ్, ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో అతి భారీ పొగమంచు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) హెచ్చరించింది. ఈ మేరకు ఆయా రాష్ట్రాలకు 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. మరోవైపు, జనవరి 1వ తేదీ వరకు ఈశాన్య భారతదేశం, ఒడిశా, ఉత్తరాఖండ్, సిక్కిం, పశ్చిమ బెంగాల్‌లోని హిమాలయ పర్వత ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు పరిస్థితులు కొనసాగుతాయని వాతావరణ శాఖ వెల్లడించింది. రేపు ఉత్తరప్రదేశ్, బీహార్, జార్ఖండ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో తీవ్రమైన చలి పరిస్థితులు ఉంటాయని అంచనా వేసింది. అండమాన్ నికోబార్ దీవుల్లో ఈ నెల 30 వరకు బలమైన గాలులతో కూడిన పిడుగులు, ఉరుములతో వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వినియోగదారుల వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న `నేషనల్ కన్జ్యూమర్ హెల్ప్‌లైన్` (NCH) ద్వారా 31 రంగాలకు చెందిన వినియోగదారులకు 45 కోట్ల రూపాయల రిఫండ్ లభించింది. గత 8 నెలల్లో 67 వేలకుపైగా వినియోగదారుల ఫిర్యాదులను హెల్ప్‌లైన్ పరిష్కరించిందని వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇందులో అధికభాగం ఫిర్యాదులు ఈ-కామర్స్ రంగానికి చెందినవే. వినియోగదారుల హెల్ప్‌లైన్ దేశవ్యాప్తంగా ఒకే వేదికగా మారి, న్యాయపరమైన దశకు ముందే ఫిర్యాదుల పరిష్కారం అందిస్తున్నదని మంత్రిత్వ శాఖ పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = =